www.hamsakalam.com

PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక

HAMSAKALAM VARTHA

ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి



మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 12 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 114 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

MEDCHAL ,MALKAJGIRI | SATURDAY AUGUST 12 2026 | VOL:1 | ISSUE: 114 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary

# ఉద్యోగులకు సీఎం రేవంత్ పండుగ కానుక

## డీఏల విడుదల - పీఆర్సీపై కీలక నిర్ణయం..!!




- రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం కసరత్తు
- పీఆర్సీ నివేదిక వచ్చాక ఉద్యోగ సంఘాలతో చర్చించి నిర్ణయం
- అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆర్థిక శాఖతో సమీక్ష: సీఎం రేవంత్‌రెడ్డి
- డీఏలపై ఈరోజు లేదా రేపు కీలక ప్రకటనకు అవకాశం
- ఈ నెల 18న సీఎస్‌తో ఉద్యోగ సంఘాల భేటీ
- ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి.. మూడు వెంటనే ఇవ్వాలని ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి
- దసరా నుంచే పీఆర్సీ అమలు చేయాలని కోరిన ఉద్యోగ సంఘాలు
- రెండు డీఏలతో ఏటా రూ.6 వేల కోట్ల అదనపు భారం
- వచ్చే నెల 1 నుంచి పెరిగిన డీఏ చెల్లింపుపై అంచనాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్న సీఎం

**,హైదరాబాద్:సెప్టెంబర్ 11**

తెలంగాణ ఉద్యోగులకు గుడ్ న్యూస్. తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటనకు కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్ తో ఉద్యోగ సంఘాల నేతల సమావేశం సమయంలో కీలక అంశాల పైన చర్చించారు. దీంతో.. సీఎం సానుకూలంగా స్పందించారు. డీఏలు విడుదల దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే, పీఆర్సీ పైన సీఎం రేవంత్ కీలక హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతల సమాచారం. దీంతో.. ప్రభుత్వం చేసే ప్రకటన పైన ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రెండు డీఏ(కరవు భత్యం)లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌తో ఉద్యోగ సంఘాల నేతలు సమావేశం అయ్యారు. అన్ని అంశాలపై ఆర్థిక శాఖ అధికారులతో

(మిగతా 2వ పేజీలో..)

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని

(మిగతా 2వ పేజీలో..)




## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర

(మిగతా 2వ పేజీలో..)



## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంపై కేటీఆర్ స్పందన
- సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ
- కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ

నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు



(మిగతా 2వ పేజీలో..)

## 45 నిమిషాల పాటు మోదీ, పుతిన్‌ల సమావేశం... ఇరువురు నేతలు చర్చించిన అంశాలు ఇవే

**,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 11**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ అయ్యారు. ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 12-13 తేదీలలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇందుకోసం పుతిన్ ఈరోజు (సెప్టెంబర్ 11) తెల్లవారుజామున న్యూఢిల్లీ చేరుకున్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందుగా వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దాదాపు 45 నిమిషాల పాటు మోదీ, పుతిన్‌ల సమావేశం సాగింది. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన, పారిశ్రామిక సహకారంతో సహా ద్వైపాక్షిక ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నాయకులు చర్చించినట్టుగా తెలుస్తోంది. సంబంధిత వర్గాల ప్రకారం... ఇరుదేశాల మధ్య పారిశ్రామిక సహకారాన్ని విస్తరించే మార్గాలపై మోదీ, పుతిన్‌లు ప్రధానంగా చర్చించినట్టుగా తెలుస్తోంది. సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు భారతదేశంలో మొదటిసారిగా జరిగిన రష్యా అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శన "ఇన్నోప్రోమ్ ఇండియా"ను వారు స్వాగతించారు. వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలను మరింత విస్తరించడంలో దాని ప్రాముఖ్యతను మోదీ, పుతిన్‌లు నొక్కి చెప్పారు. ఇద్దరు నాయకులు ఇన్నోప్రోమ్ ఇండియా ప్రదర్శనను కూడా సందర్శించి, అక్కడ పాల్గొన్నవారితో ముచ్చటించారు. బ్రిక్స్ కూటమిలో భారత్-రష్యా భాగస్వామ్యంపై నాయకులు తమ అభిప్రాయాలను మోదీ, పుతిన్‌లు పంచుకున్నారు.

(మిగతా 2వ పేజీలో..)



హంస కలం వార్త

# ఉద్యోగులకు సీఎం రేవంత్ పండుగ కానుక, డీఏల విడుదల - పీఆర్సీ పై కీలక నిర్ణయం..!!

(మొదటి పేజీ తరువాయి)

చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. కనీసం రెండు డీఏలు చెల్లిస్తే ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.6 వేల కోట్ల భారం పడుతుందని ఆర్థిక శాఖ అంచనా వేసారు. ఈ రోజు లేదా రేపు డీఏ పైన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నెల 18న ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించనున్నందున ఆరోజు ప్రకటన వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్న ఉద్యోగ సంఘాల నాయకులు, 3 డీఏల విడుదలపై అసెంబ్లీ సమావేశాల్లోనే ఉత్తర్వులివ్వాలని కోరారు. తెలంగాణలో దసరా పెద్ద పండుగ అని, అప్పటి నుంచే పీఆర్సీ అమలయ్యేలా చూడాలని కోరగా రంజాన్ కూడా పెద్ద పండుగే కదా అని సీఎం నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

**ముందుగా డీఏల విడుదల... పీఆర్సీ పై చర్చలు**

అదే విధంగా పీఆర్సీ నివేదిక అందిన తర్వాత పరిశీలించి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఖరారు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక ఆర్థిక శాఖతో సమావేశమై ఆర్థిక పరిస్థితిని సమీక్షించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఎం తెలిపారని ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు. అయితే.. ఉద్యోగులకు ఇప్పటి వరకు మొత్తం గా ఐదు డీఏలు మంజూరు చేయాల్సి ఉండగా, అందులో మొదటి దానికి రూ.3,700 కోట్లు, రెండో దానికి రూ.2,300 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా చేస్తున్నారు. రెండు డీఏలను ఇప్పటికిప్పుడు మంజూరు చేసి వచ్చే నెల 1వ తేదీ జీతాల నుంచి ఉద్యోగులకు చెల్లిస్తే నెలకు కనీసం రూ.500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని ప్రాథమిక అంచనా. రెండు డీఏలు ఇస్తే రూ.6 వేల కోట్ల ఆర్థిక భారం ఏటా భరించాల్సి ఉన్నందున అంత మేరకే ఆర్థిక శాఖ వివరాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో.. డీఏ పైన ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నేతలు భావిస్తున్నారు.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది: ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

**బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత**

**ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య**

**తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.




## 45 నిమిషాల పాటు మోదీ, పుతిన్‌ల సమావేశం... ఇరువురు నేతలు చర్చించిన అంశాలు ఇవే

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ ఆసియా , నల్ల సముద్ర ప్రాంతంలో సముద్ర వాణిజ్యం, భారతీయ నావికుల భద్రతపై ప్రభావం చూపిన సంఘర్షణలతో సహా, పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై కూడా వారు తమ దృక్కోణాలను షేర్ చేశారు.భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ నిలదొక్కుకుంటున్న ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంలో నిమగ్నమై ఉండటానికి ఇరువురు నాయకులు అంగీకరించారు.సివిల్ న్యూక్లియర్ సహకారం అజెండాలోని మరో కీలక అంశంగా ఉన్నట్టుగా సమాచారం. రష్యాలో నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికుల రాకపోకలను విస్తరించడం, వారి ఉనికిని పెంచడంపై కూడా ఇరుపక్షాలు చర్చించినట్టుగా సంబంధిత వర్గాలు తెలిపాయి.ఇక, 24వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు రష్యాను సందర్శించాలని ప్రధాని మోదీని పుతిన్ ఆహ్వానించారు. ప్రధాని మోదీ ఆ ఆహ్వానాన్ని అంగీకరించారు. దౌత్య మార్గాల ద్వారా పరస్పర సౌలభ్యం మేరకు శిఖరాగ్ర సమావేశ తేదీలను నిర్ణయించనున్నారు. ఇదిలాఉంటే, మోదీ, పుతిన్‌ల మధ్య ఈ ఏడాది జరిగిన రెండో సమావేశం ఇది. మోదీ, పుతిన్‌లు అంతకుముందు 2026 ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన 26వ ఎస్‌సీవో శిఖరాగ్ర సమావేశం సందర్భంగా సమావేశమయ్యారు.

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిందని వెల్లడి

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మంచిర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.



# ఆర్‌సీ పురం, కేపీహెచ్‌బీలో ట్రాఫిక్ నిర్వహణపై జాయింట్ సీపీ సమీక్ష..!

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ శుక్రవారం ఆర్‌సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ట్రాఫిక్ పోలీసుల విధులు, ట్రాఫిక్ నియంత్రణ, అమలు చేస్తున్న చర్యలను సమీక్షించారు. ఉదయం సుమారు 11.30 గంటలకు ఆర్‌సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న జాయింట్ సీపీ వెంట డీసీపీ ట్రాఫిక్–2 శేషాద్రిణి రెడ్డి, ఐపీఎస్, ఏడీసీపీ ట్రాఫిక్–2 ఏ. వీరన్న, ఆర్‌సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓతో పాటు ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను జాయింట్ సీపీ పరిశీలించారు. ప్రతిరోజూ ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బంది విధులు నిర్వహిస్తున్న ప్రధాన ట్రాఫిక్ పాయింట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 2025, 2026 సంవత్సరాల ట్రాఫిక్ అమలు, ఉల్లంఘనలపై నమోదైన గణాంకాలను పరిశీలించి, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు చేశారు. అదేవిధంగా ఆర్‌యూబీ, లింగంపల్లి ఫ్లైఓవర్, జాతీయ రహదారి–65 అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల సమయంలో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జాయింట్ సీపీ లింగంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. రైల్వే స్టేషన్‌ను చుట్టుపక్కల ప్రాంతాలతో అనుసంధానించే బస్సు సౌకర్యాలపై ఆరా తీశారు. స్టేషన్ మీదుగా నడుస్తున్న రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో రైళ్లలో ఎక్కే, దిగే ప్రయాణికుల సంఖ్యను కూడా పరిశీలించారు. తదుపరి



కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన ట్రాఫిక్ ప్రాంతాలను జాయింట్ సీపీ సందర్శించారు. ప్రగతి నగర్ యూటర్న్, రెమెడీ యూటర్న్ వద్ద ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు, ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను సమీక్షించారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. ప్రజల సౌకర్యం, రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. హెడ్‌లైన్‌కు మరో చిన్న రూపం: ఆర్‌సీ పురం, కేపీహెచ్‌బీలో ట్రాఫిక్‌పై జాయింట్ సీపీ సమీక్ష రద్దీ నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు..

# గ్రామ సర్పంచులు తమ గ్రామంలోని జనరల్ ఫండ్ ను స్వయంగా వాడుకునే విధంగా చట్ట సవరణ చేసిన

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కి ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్ కి తెలంగాణ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. త్రిపురారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్పంచులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న జనరల్ ఫండ్ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని కొనియాడారు. అదే విధంగా జాయింట్ చెక్ పవర్ పై ఉన్నటువంటి షరతులను సవరణ చేసి కొంతమేరకు ఉపశమనం కల్పించినప్పటికీ శాశ్వతంగా ఉపసర్పంచులకు జాయింటచెక్ పవర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచుల గౌరవేతనం 6500 నుంచి 25 వేల వరకు పెంచాలని సర్పంచుల ఫోరం డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలను ప్రత్యేక ప్రభుత్వాలుగా గుర్తిస్తూ చట్ట సవరణ చేయాలని కోరారు. రాష్ట్రానికి దేశానికి గ్రామాల ఆదాయం తోటే తలసరి ఆదాయం పెరుగుతుందని కానీ గ్రామాల అభివృద్ధికి ఆ మేరకు



కేటాయించడం లేదని పట్టణాలపై చూపుతున్నటువంటి ప్రేమను గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో గ్రామాలే పట్టుకొమ్మలుగా చెప్పుకుంటున్నటువంటి దేశంలో గ్రామాల కేటాయిస్తున్నటువంటి నిధులు అరకొరగా ఉన్నాయని ఆ నిధులతో గ్రామాల యొక్క మౌలిక సదుపాయాలు కల్పించడానికి కూడా ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ లు గుండెబోయిన వెంకటేశ్వర్లు, సతీష్, ధనవతవెంకట్రావు, సఫియా బేగం, పుల్లయ్య, అశోక్ గౌడ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం

**తెలంగాణ హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్**

**ఐ ఎఫ్ టి యు అనుబంధం**

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

సెప్టెంబర్ 15- 2026 లిస్థలం సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ జరిగే లిరాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని ఐజ లిమండలంలో వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి మానుగడకు రైతు ఎంత అవసరమో ఉత్పత్తి అయినా అవసరాలను ప్రజలకు చేరువేసేది హమాలి కూడా అంతే అవసరం మార్కెట్లలో జరిగే వ్యాపారం అన్ని అమాలి కార్మికులు శ్రమ మీదే ఆధారపడి ఉన్నాయి అయితే నిత్యం బరువులు మోస్తూ శారీరక శ్రమతో సాగిస్తున్నారు హమాలీ కార్మికులకు నేటికీ కనీస హక్కులు సామాజిక భద్రత ఉద్యోగ భద్రత పింఛన్ వైద్యం సదుపాయాలు ప్రమాద బీమా వంటి ప్రాథమిక లక్షణాలు కూడా అందడం లేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిరక్షణ సాల్సింది పోయి కార్మిక వ్యతిరేక నాలుగు లేబరు కోడ్లను అమలు చేసి దశబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నాయి పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నాయి 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలి ప్రతి కార్మికుడికి పిఎఫ్ ఈఎస్ఐ గ్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రమాద బీమా తప్పనిసరిగా అమలు చేయాలి సంక్షేమ బోర్డు ద్వారా ఆరోగ్య భీమా పిల్లల విద్య సహాయం ప్రస్తి ప్రయోజనాలు వివాహ సహాయం గృహ నిర్మాణ సహాయం సహజ మరణం ప్రమాద మరణం పరిహారం అంత్రక్రియల సహాయమందించాలి సీజన్లో స్థానిక కార్మికులు ప్రాధాన్యత ఇవ్వాలి స్థానిక ఉపాధిని దెబ్బతీసే విధంగా వసూలు కార్మికులను తీసుకురావడం నిలిపివేయాలి కాంట్రాక్టర్లు ఏజెన్సీగా పేరతో జరుగుతున్న శ్రమ దోపిడిని అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి కనీసం సంవత్సరానికి 5000 కేటాయించాలి ప్రభుత్వ ప్రవేట్ గోదాములు మిల్లులో పని చేసి హమాలి క కూడా బోనస్ సౌకర్యం కల్పించాలి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను ఉపసంహరించి కార్మికుల హక్కులను పరిరక్షించే చట్టాలను అమలు చేయాలి అని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిసన్న నర్సింలు గోవిందు భీమన్న ప్రవీణ్ సుధాకర్ రాములు రామకృష్ణ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు



# పాశిగామ పాఠశాల అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ రూ.18 లక్షల నిధులు

- విద్యార్థులను సర్‌ప్రైజ్ చేస్తూ ఎంపీ నిధుల ప్రకటన.. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )



పాశిగామ, ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కీలక నిర్ణయం తీసుకున్నారు. పాశిగామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పాశిగామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎంపీ వంశీకృష్ణ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారి సమక్షంలో పాఠశాల అభివృద్ధికి రూ.18 లక్షల నిధులు ప్రకటించి విద్యార్థులను సర్‌ప్రైజ్ చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అవసరమైన బెంచీల ఏర్పాటుతో పాటు పాఠశాల భవనం, మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించనున్నారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు మంచి అభ్యసన వాతావరణం అందించడమే మా లక్ష్యం" అని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. పాశిగామ పాఠశాల సమగ్ర అభివృద్ధికి రూ.18 లక్షలు మంజూరు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# కీర్తి ముదిరాజ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

( సెప్టెంబర్-11- హంస కలంవార్త)



తెలంగాణ భవన్‌లో శాలువాతో సన్మానించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కీర్తి ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కీర్తి ముదిరాజ్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మహిళలను సంఘటితం చేయడంలో కీర్తి ముదిరాజ్ చేస్తున్న కృషిని నాయకులు ఈ సందర్భంగా అభినందించారు. ఆమెకు పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కాలనీ అధ్యక్షులు రాము ముదిరాజ్, కాలనీ వాసులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొని కీర్తి ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# లబ్ధిదారునికి రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

( సెప్టెంబర్-11- హంస కలంవార్త )

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును న్యూ అల్లాపూర్ డివిజన్‌కు చెందిన షేక్ అబ్దుల్ అర్షద్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. సెప్టెంబర్ 9, 2026 బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షేక్ అబ్దుల్ అర్షద్ (తండ్రి: షేక్ అబ్దుల్ సమద్)కు రూ.2,00,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే తన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయాన్ని అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.



హంస కలం వార్త

## శుక్రవారం ఎన్టీఆర్ భవన్ లో రాష్ట్రంలోని భూ సమస్యలపై పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో





( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

పార్లమెంట్ పార్టీ కన్వీనర్లు, రాష్ట్ర పార్టీ అనుబంధ సంఘాల మాజీ అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా 22 ఎ ఎల్,అర్.ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దేవాదాయ భూములు, వక్ఫ్ భూములు, ధరణి, భూభారతి, సాదాబైనామా, సబ్ డివిజన్, తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్బంగా.. ఈ అంశాలపై నాయకుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగింది. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో, హైదరాబాద్ మూడు కార్పోరేషన్ల పరిదిలలోని భూసమస్యల గురించి నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. 22ఎ సమస్యలపై సెప్టెంబర్ 16వ తేదిన అన్ని జిల్లాల కలెక్టర్లకు పార్లమెంట్ పార్టీ కన్వీనర్ల అధ్వర్యంలో మోమోరాండంలు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ తదుపరి కార్యచరణను రూపొందించి తదుపరి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్బంగా పోలిట్ భ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు మాట్లాడుతూ... 22ఎ అనేది లావూణి, సర్కారు,దేవాదాయ, భూదాన భుములు, వక్ఫ్ వంటి భుములకు ప్రోటెక్టర్ ఉండాలన్నదే ఉద్దేశ్యం. ధరణి వచ్చాక భూస్వామలు భూములను కాపాడాటానికే తీసుకొచ్చారని అరోపణలు వచ్చాయి. ఎస్ కే సిన్హా కమిటీ రిపోర్టు ఏమైందో తెలియదు. భూ భారతి వచ్చాక 2005 డిసెంబర్ లో అధికారులు చేసిన తప్పిదాల వల్ల ప్రవేట్ భూములు 22ఎ లో చేర్చారాని ప్రభుత్వమే ఒప్పుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ప్రభుత్వాలు ప్రభుత్వ భూములను అమ్మేస్తున్నారు. రాబోయే తరాల అవసరాలకు భూములను లేకుండా చేస్తున్నారు. భూమిని కాపాడటం అనేది అందరి కర్తవ్యమని అన్నారు .ఈ సమావేశంలో కేంద్ర మాజీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, రాష్ట్ర పార్టీ మాజి ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, రాష్ట్ర పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజు నాయక్, రాష్ట్ర మాజీ అధికారప్రతినిధులు నెల్లురి దుర్గా ప్రసాద్, పార్లమెంట్ పార్టీ కన్వీనర్లు వాసిరెడ్డి రామానాథం, కుందారపు క్రిష్ణమాచారీ, కసిరెడ్డి శేఖర్ రెడ్డి, ఇల్లందల రమేష్, సంజయ్, గుళ్లపల్లి అనంద్, నాగు నగేష్, కట్టా వెంకటేష్ గౌడ్, రాష్ట్ర అనుబంధసంఘాల మాజీ అధ్యక్షులు శ్రీపతి సతీష్, ఎం.కే బోస్, పోలంపల్లి అశోక్, ముంజా వెంకట్రాజం గౌడ్, గజేంద్ర గౌడ్, టి హరిక్రిష్ణ, పర్లపల్లి రవీందర్, వెలివెల దుర్గా రావు, రాష్ట్ర నాయకులు వేజెండ్ల కిశోర్ బాబు, ముత్తినేని సైదేశ్వర్ రావు, రాష్ట్ర పార్టీ నాయకులు సాయి అన్న గౌడ్ , గూడెపు రాఘవులు , ఏ బి ఆర్ మోహన్ , జోగేందర్ సింగ్ , చంద్రశేఖర్ , మెట్టుదామోదర్ రెడ్డి , రేపుల వీరేశం , కట్ట జనార్ధన్ , తదితరులు పాల్గోన్నారు.

## మూడేళ్ల క్రితం ఇదే రోజు...

(సెప్టెంబర్-11- హంస కలంవార్త)






తెలుగు జాతి ఆర్థిక పరిపుష్టికి స్వర్ణధారైన సైబరాబాద్ సృష్టికర్త, అమరావతి రూపకర్త మాన్య నారా చంద్రబాబు నాయుడు ని కుట్రపూరితంగా నిర్బంధించిన ఘటనను నిరసిస్తూ, 11-09-2023న కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్, జేఎన్‌టీయూ వద్ద అన్న నందమూరి తారక రామారావు విగ్రహం సాక్షిగా నిరసన కార్యక్రమం చేపట్టాం.ఈ సందర్భంగా పలువురు మీడియా మిత్రులతో మాట్లాడి, నారా చంద్రబాబు నాయుడు పై జరిగిన చర్యను తీవ్రంగా ఖండించాం.ఆ సమయంలో తెలుగుదేశం పార్టీకి ఎవరితోనూ రాజకీయ పొత్తులు లేవు. అయినప్పటికీ, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించి, నారా చంద్రబాబు నాయుడు కి మద్దతుగా నిలిచారు.ఆ క్లిష్ట సమయంలో అండగా నిలిచిన పవన్ కళ్యాణ్ కి మరొక్కసారి హృదయపూర్వక ధన్యవాదాలు. ఆ రోజు ఒక నిర్బంధం... ఒక పోరాటానికి నాంది... ప్రజాస్వామ్య విలువల కోసం నిలిచిన రోజు...

## భక్తికి పర్యావరణ సంకల్పం.. చిర్రా రవీందర్ యాదవ్ వినూత్న ప్రయత్నానికి కేటీఆర్ ప్రశంసలు

**కేటీఆర్ చేతుల మీదుగా 5,000 సీడ్ గణపతుల పంపిణీకి శ్రీకారం**

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో చిర్రా రవీందర్ యాదవ్ చేపట్టిన 5,000 సీడ్ గణపతుల పంపిణీ కార్యక్రమానికి కేటీఆర్ చేతుల మీదుగా శ్రీకారం చుట్టడం జరిగింది.ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించిన కేటీఆర్ , చిర్రా రవీందర్ యాదవ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు.నిమజ్జనం అనంతరం విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదిగేలా సీడ్ గణపతులను రూపొందించారు."భక్తితో గణపతిని పూజిద్దాం... బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం." చిర్రా రవీందర్ యాదవ్

# జర్నలిస్టులకు 'ఎల్ఐజీ, స్కీంను వర్తింపజేయండి





**హౌసింగ్ టవర్లు నిర్మించి 2బీహెచ్ కే ఫ్లాట్లు ఇవ్వండి**

**లేదా 200 గజాల స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి**

**ఖమ్మం ప్రెస్ క్లబ్ పై విచారణ పూర్తి చేసి ఎన్నికలు జరపండి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కోరిన డబ్ల్యూజేఐ ప్రతినిధులు**

**విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర టి.ఎస్**

ఖమ్మం, ( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య, ఖమ్మం ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కలిశారు. ప్రస్తుతం హైదారాబాద్ లో అమలు చేస్తున్న ఎల్ఐజీ (లో ఇన్కమ్ గ్రూప్) స్కీమును జర్నలిస్టులకు కూడా వర్తింపజేయాలని కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా హౌసింగ్ టవర్లు నిర్మించి, వాటిలో సుమారు 1200 అడుగుల విస్తీర్ణంలో 2బీహెచ్ కే ఫ్లాట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇది సాధ్యం కానీ పక్షంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు 200 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇంటిని కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్.రావు), జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో కన్వీనర్ ఏం.ఏ అన్సార్ పాషా, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ మరియు ప్రెస్ క్లబ్ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబ రావు, ఏనిగండ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్ తదితరులు కలెక్టర్ దివాకర టి.ఎస్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై కూడా డబ్ల్యూజేఐ ప్రతినిధులు కలెక్టర్ తో సుధీర్ఘంగా చర్చించారు. చాలా కాలంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు జరగడంలేని తెలిపారు. ప్రస్తుతం, ప్రెస్ క్లబ్ నిర్వహణపై జరుగుతున్న విచారణను వెంటనే పూర్తి చేసి, ఎన్నికలు జరపాలని కోరారు. ఈ అంశంపై కూడా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర టి.ఎస్, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని డబ్ల్యూజేఐ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

# తెలంగాణ ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ



**రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల, చిన్నారుల, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేవ శ్రద్ధ వహిస్తూ వారికి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని,**

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

అందులో ఏలాంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని తెలంగాణ రాష్ట్ర పుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతి లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం పర్యటించారు. మేడ్చల్ తహాసీల్దారు కార్యాలయంలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి ఛైర్మన్ కు, సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా మేడ్చల్ లోని చౌక ధరల ధుకాణాలను పరిశీలించి డీలర్ తో స్టాక్ వివరాలు,రిజిష్టర్ల నమాదులు పరిశీలించారు. చౌకధరల దుకాణం వద్ద ఫిర్యాదుల బాక్సులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఫిర్యాదులు ఇచ్చేందుకు గాను జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల తహాసీల్దార్ల ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని ఛైర్మన్ సూచించారు. సన్న బియ్యం అందుతున్నాయా అని, మీకు సౌకర్యవంతంగా డీలర్లు బియ్యం అందిస్తున్నారా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ని సందర్శించి డైనింగ్ హాల్, స్టోర్ రూం పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ సరుకులను వాడాలని, నాణ్యమైన సన్నబియ్యం మాత్రమే వండాలని, బియ్యం నాణ్యత లేకుంటే వెంటనే అధికారులకు తెలియజేసి మార్చుకోవాలని తెలిపారు. స్కూలులో ఉడికించిన గుడ్లను పరిశీలించి వాటి రంగు మారిందని, తెల్లగా ఉండాల్సిన గుడ్లరంగు మారడానికి కారణాలు ఎమిటని అడిగారు. గుండ్లను సేకరించి ఎందుకురంగు మారాయని ఫుడ్ స్టేఫ్టీ అధికారి టెస్ట్ చేయించి నివేదిక అందించాలని ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ చెకప్ రిజిష్టర్లను పరిశీలించిరక్తహీనత ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. పేరెంట్స్ కమిటీ మీటింగులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకొని సంబంధిత రిజిష్టర్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యారుల తో ముచ్చటిస్తూ స్కూల్ లో ఏమైనా సమస్యలున్నాయా అని, మెను ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీరు టాయిలెట్లు మౌళిక వసతులు సరిగా ఉన్నాయా అని అడిగి, ఏవైనా సమస్యలుంటే ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని ఛైర్మన్ విద్యార్థులకు సూచించారు. నిర్భయంగా నిజాన్ని చెప్పే ధైర్యం ఉండాలని, అప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదురుకుంటారని, తద్వారా భవిష్యత్తులో సమాజం పట్ల బాధ్యతగా ఉండగలరని విద్యార్థులకు భోధించారు.

దమ్మాయిగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు అధిక సంఖ్యలో లంచ్ బాక్సులు తెచ్చుకోవడం గమనించిన కమీషన్ సభ్యులు, ఎందుకు ఇంటి నుండి బాక్స్ తెచ్చుకుంటున్నారని అడుగగా, విద్యార్థులు భోజనం సరిగా ఉండడం లేదని కమీషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి లోపాలను ఉపేక్షించబోమని విచారించి సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, తాము మళ్లీ వచ్చి పరిశీలస్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం దమ్మాయిగూడలోని అంబేద్కర్ నగర్ లోని, జవహార్ నగర్ మల్కాపురంలోని అంగన్ వాడీ కేంద్రాలను ఛైర్మన్ సభ్యులు సందర్శించారు. కేంద్రాలలో ఎంత మంది చిన్నారులున్నారని, ఎంతమంది గర్భిణులు వస్తారని, వారికి సరిపడా పౌష్టికాహారం, గుడ్లు, పాలు



అందించడం జరుగుతుందా అని పరిశీలించారు. అంగన్ వాడీ సెంటర్లలో భోజనం మెను ప్రదర్శించాలని అదేశించారు. గర్భిణులు, 14 సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం తీసుకోవడం వారి హక్కు అని, చట్టబద్ధమైన ఈ హక్కును కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కమీషన్ పైన ఉందన్నారు. ఈ హక్కు దారులకు నష్టం జరుగకుండా వారి హక్కులకు భంగం కలుగకుండా చూడడానికి కమీషన్ ఎప్పుడు సిద్దంగా ఉంటుందన్నారు. ఏక్కడైన సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సభ్యులు తమ ఫోన్ నంబర్లను గర్భిణి స్త్రీలకు అందజేసారు. ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటి సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్ కుమార్, పద్మజా, కాంతమ్మ, డిఎం అండ్ హెచ్ఓ అనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద, తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త
సెప్టెంబర్ । శనివారం । 12 । 2026



# మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో గ్రంథాలయ సెస్ వసూళ్లు, పెండింగ్ బకాయిల చెల్లింపులు మరియు గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణపై సమీక్షా సమావేశం



( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజన్ అహ్మద్ అధ్యక్షతన వారి ఛాంబర్‌లో నిర్వహించబడింది.ఈ సమావేశంలో బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి , ఛైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా, సంబంధిత మున్సిపాలిటీల కమిషనర్లు మరియు కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ పేరం సురేష్ బాబు పాల్గొన్నారు.సమావేశంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలు మరియు ఇతర స్థానిక సంస్థల నుండి గ్రంథాలయ సెస్‌ను సక్రమంగా, సకాలంలో వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయవలసిన అంశంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ సెస్స్ కమిటి చైర్మన్ ఫైజన్ అహ్మద్ మాట్లాడుతూ, వివిధ మున్సిపాలిటీల వద్ద పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను ప్రాధాన్యతతో చెల్లించాలని సూచించారు. ముఖ్యంగా బకాయిలను ప్రతి నెల రూ.2.00 లక్షల చొప్పున చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధిత మున్సిపాలిటీల అధికారులు అంగీకరించి, నిర్ణీత విధానంలో బకాయిల చెల్లింపుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ప్రతి మున్సిపాలిటీ గ్రంథాలయ సెస్ వసూళ్లు, బకాయిలు మరియు చెల్లింపుల వివరాలను క్రమం తప్పకుండా జిల్లా గ్రంథాలయ సంస్థకు అందజేయాలని నిర్ణయించబడింది. పెండింగ్‌లో ఉన్న బకాయిల వివరాలను సంస్థల వారీగా సేకరించి, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా వాటిని సకాలంలో వసూలు చేయాలని సూచించారు.సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి గతంలో ప్రతి నెల సుమారు రూ.5.00 లక్షలు గ్రంథాలయ సెస్‌గా చెల్లించబడుచుండగా, ఏప్రిల్, 2026 నుండి ఇప్పటి వరకు సంబంధిత సెస్ మొత్తం అందకపోవడంపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ మొత్తాన్ని తక్షణమే విడుదల చేయవలసిందిగా సంబంధిత అధికారులకు లేఖలు రాసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.అదేవిధంగా, 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.4.00 కోట్లు గ్రంథాలయ సెస్ వసూలు చేయాలని బడ్జెట్‌లో లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, 2026 నుండి ఆగస్టు, 2026 వరకు రూ.5.00 కోట్లకు పైగా గ్రంథాలయ సెస్ వివిధ స్థానిక సంస్థల నుండి వసూలు కావడం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది.మిగిలిన ఆర్థిక సంవత్సరంలో కూడా వసూళ్లను మరింత వేగవంతం చేసి, నిర్దేశించిన బడ్జెట్ లక్ష్యాన్ని మించి అధిక మొత్తంలో గ్రంథాలయ సెస్ వసూలు చేయుటకు అన్ని స్థానిక సంస్థలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆన్‌లైన్ ద్వారా చెల్లించబడుతున్న గ్రంథాలయ పన్ను/సెస్‌కు సంబంధించి కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ-సేవా కేంద్రాల ద్వారా చెల్లించబడిన గ్రంథాలయ పన్ను వివరాలు మరియు సంబంధిత మొత్తాలపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఈ-సేవా అధికారులకు లేఖలు పంపేందుకు తగిన ఫైల్‌ను సమర్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేరం సురేష్ బాబు ని కోరడం జరిగింది.అదేవిధంగా, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, యువత మరియు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు



చేయుటకు చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను కోరడం జరిగింది. ప్రజలకు చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం, వార్తాపత్రికలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక సంస్థలు సహకరించాలని సూచించారు.గ్రంథాలయ సెస్ ద్వారా లభించే ఆదాయం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాల కల్పన, నూతన గ్రంథాలయ సేవల విస్తరణ, విద్యార్థులు మరియు యువతకు అవసరమైన అధ్యయన సదుపాయాల కల్పనకు ఎంతో ఉపయోగపడుతుందని ఛైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.గ్రంథాలయ సెస్ వసూళ్ల పురోగతి, పెండింగ్ బకాయిలు మరియు చెల్లింపుల పరిస్థితిని ప్రతి మూడు నెలలకు ఒకసారి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించబడింది.సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంబంధిత అధికారులు సమర్థవంతంగా అమలు చేసి, గ్రంథాలయ సెస్‌ను పూర్తిస్థాయిలో మరియు సకాలంలో వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజన్ అహ్మద్ సూచించారు.గ్రంథాలయాల అభివృద్ధి ద్వారా విద్యార్థులు, యువత మరియు ప్రజలకు మెరుగైన విజ్ఞాన సేవలు అందించాలనే లక్ష్యంతో అన్ని స్థానిక సంస్థలు జిల్లా గ్రంథాలయ సంస్థతో సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# గ్రామాల అభివృద్ధి కి పెద్ద పీట...





చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

ఈ కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో 40 లక్షల రూపాయల నిధులతో వేసిన సీసీ రోడ్లు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని నిధులు నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్ లో జమ చేస్తుందని అన్నారు గ్రామాల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రానేజీలు, పచ్చదనం, పరిశుభ్రత,



విధి లైట్లు, వైకుంఠ ధామాలు, అనేక సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేస్తుందని అన్నారు..ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహ రెడ్డి , మహేశ్వరం అసెంబ్లీ ఇంచార్జి అందేలా శ్రీరాములు యాదవ్ , జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎల్మాటి దేవేందర్ రెడ్డి , రాష్ట్ర , జిల్లా మండల నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, పలు గ్రామ పంచాయతీల సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు ,మాజీ వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు యువకులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

# 22ఎ భూముల సమస్య పరిష్కరించాలి

- కేటీఆర్, హరీశ్‌రావుకు కూకట్‌పల్లి కాలనీ అసోసియేషన్ సభ్యుల వినతి

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )





కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్ తదితర కాలనీ అసోసియేషన్ సభ్యులు తమ భూములను 22ఎ జాబితాలో చేర్చడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించి తమ భూములను 22ఎ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ భవన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తూ ప్రజల ఆస్తులకు కూడా భద్రత లేకుండా చేస్తోందని ఆరోపించారు. ప్రజల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మంచి రోజులు వస్తాయని, 22ఎ భూముల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో 22ఎ జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా 22ఎ భూముల సమస్యపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం 22ఎ భూముల సమస్యను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ లిసతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు లిలిమందాడి శ్రీనివాసరావు, ఆవుల రవీందర్ రెడ్డి, పగడాల శిరీష్ బాబురావు, సబిహా గౌసుద్దీన్‌లి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా.. ప్రజల మధ్యే ముద్దం నర్సింహ యాదవ్



( సెప్టెంబర్-11- హంస కలంవార్త)

అంజయ్య నగర్‌లో స్థానికులతో సమావేశమై సమస్యలపై ఆరా కూకట్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ప్రజల మధ్య పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా అంజయ్య నగర్‌లో స్థానిక ప్రజలతో సమావేశమై కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, శానిటేషన్, తాగునీరు, వీధి విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచాలని కోరారు. స్థానికులు తెలిపిన సమస్యలపై ముద్దం నర్సింహ యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కాలనీలో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, రాములు, మధుకర్, శ్రీను, రాజు, రాజయ్య, ఐలేష్, భూమేష్, టిటు, కళ్యాణి, అలివేలు, పుష్పమ్మ, కొమురవ్వ తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎగ్రా పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# 22 బాధిత కుటుంబాలకు రూ.14.91 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం



(సెప్టెంబర్-11- హంస కలంవార్త )

చెక్కులు అందజేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ( సి.ఎం.ఆర్.ఎఫ్)కు దరఖాస్తు చేసుకున్న 22 మంది బాధిత కుటుంబాలకు రూ.14,91,300 ఆర్థిక సహాయం మంజూరైంది. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని గాంధీ అన్నారు. వైద్య ఖర్చులను భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక



కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, జంగయ్య యాదవ్, చంద్రారెడ్డి, ఎం.డి. ఇబ్రహీం, జిల్లా గణేష్, క్రాంతి, మల్లయ్య, గోపాల్, శివసాగర్, సల్లాఉద్దీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ కేంద్రంగా రేషన్ మాఫియా.. నిద్ర మత్తులో పౌర సరఫరాల శాఖ?

**కనుమరుగవుతున్న పేదల బియ్యం!**

**రోజూ వందల టన్నుల అక్రమ రవాణా..**

**చీకటి పడితే చాలు బరితెగిస్తున్న స్మగ్లర్లు..**

**చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నఅధికారులు!**

( సెప్టెంబర్-11 హంస కలంవార్త )

కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న జహీరాబాద్ రేషన్ మాఫియాకు సేఫ్ జోన్‌గా మారిపోయింది. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం నిత్యం వందల టన్నుల కొద్దీ పక్క రాష్ట్రానికి అక్రమంగా తరలిపోతోంది. పక్కా ప్రణాళికతో దళారులు సాగిస్తున్న ఈ చీకటి దందా స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.పగలు సేకరణ.. రాత్రికి రవాణా: అక్రమార్కులు పక్కా వ్యూహంతో ఈ స్మగ్లింగ్ నడిపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పల్లెల్లో తిరుగుతూ ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, రహస్య స్థావరాల్లో నిల్వ చేస్తున్నారు.మిడ్ నైట్ ఆపరేషన్: రాత్రి 9 గంటలు దాటగానే స్మగ్లర్ల అసలు ఆట మొదలవుతోంది. రాత్రి 10 నుంచి 11 గంటల సమయంలో నిల్వ ఉంచిన బియ్యాన్ని ముందుగా అశోక్ లేలాండ్, ఇతర మినీ గూడ్స్ వాహనాల్లో నింపుతున్నారు.రహస్యంగా కాటా.. భారీ లారీల్లోకి షిఫ్టింగ్: జహీరాబాద్ పరిసరాల్లో ఎవరికీ అనుమానం రాని విధంగా ఏర్పాటు చేసుకున్న రహస్య ధర్మకాంటాల వద్ద ఈ బియ్యాన్ని తూకం వేస్తున్నారు. ఆ తర్వాత అక్కడికక్కడే ఆ బియ్యాన్ని భారీ లారీల్లోకి మార్చి, గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక బోర్డర్ దాటిస్తున్నారు.చోద్యం చూస్తున్న యంత్రాంగం: ప్రతిరోజూ వందల టన్నుల బియ్యం, భారీ వాహనాల్లో సరిహద్దులు దాటుతున్నా రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాల శాఖ అధికారులు ఏం చేస్తున్నారన్నది ఇప్పుడు అతిపెద్ద




ప్రశ్న. ఇంత భారీ స్థాయిలో రవాణా జరుగుతుంటే స్థానిక అధికారులకు కనీస సమాచారం లేదనడం పలు అనుమానాలకు తావిస్తోంది.విశ్వసనీయ సమాచారం మేరకు సాగుతున్న ఈ రేషన్ దందాపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి దీని వెనుక ఉన్న బడా మాఫియాను కటకటాల వెనక్కి నెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



# టీమిండియాలో గాయాల బెడద.. కీలక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ

**స్పోర్ట్స్ సైన్స్ హెడ్ పోస్టుకు మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ**

**బెంగళూరు సీవోఈలో కీలక బాధ్యతలు**

**2025 మార్చి నుంచి ఖాళీగా ఉన్న పోస్టు**

**నితిన్ పటేల్ తర్వాత భర్తీ కాని స్థానం**

**ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్‌పై పర్యవేక్షణ**



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో కీలక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో 'హెడ్-స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్' పదవికి మళ్లీ దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టును గతేడాది సెప్టెంబర్‌లోనూ భర్తీ చేసేందుకు ప్రయత్నించినా.. సరైన అభ్యర్థి దొరకకపోవడంతో ప్రక్రియ పూర్తికాలేదు. ఈ పదవి 2025 మార్చి తర్వాత ఖాళీగా ఉంది. దాదాపు మూడేళ్లు సీవోఈలో సేవలందించిన మాజీ టీమిండియా ఫిజియో నితిన్ పటేల్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. 2023 వన్డే ప్రపంచకప్ ముందు జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మహ్మద్ షమీల రికవరీలో పటేల్ కీలక పాత్ర పోషించారు. కొత్తగా ఎంపికయ్యే వ్యక్తి బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ విభాగానికి వ్యూహాత్మక, నిర్వహణపరమైన నాయకత్వం వహించాలి. జాతీయ జట్టు ఫిజియోలు, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ నిపుణులతో పాటు సీవోఈలోని వైద్య సిబ్బందిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆటగాళ్ల గాయాల నివారణ, చికిత్స, పునరావాసం, ఫిట్‌నెస్, శారీరక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కొత్త వైద్య విధానాలు, పరిశోధనలు, సాంకేతికతను ఉపయోగించడం కూడా ఈ పోస్టులో కీలక బాధ్యతలుగా బీసీసీఐ పేర్కొంది. ఆటగాళ్ల ఆరోగ్యం, దీర్ఘకాలిక ఫిట్‌నెస్, గాయాల ముప్పు తగ్గించడం వంటి అంశాలపై వ్యూహాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ పోస్టుకు స్పోర్ట్స్ సైన్స్ లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ తప్పనిసరి. డాక్టరేట్ ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తారు. ప్రొఫెషనల్ లేదా ఒలింపిక్ క్రీడల్లో బృందాలకు నాయకత్వం వహించిన కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయసు 60 ఏళ్లలోపు ఉండాలి. ఎంపికైన వ్యక్తి సీవోఈలో హెడ్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న మాజీ భారత బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 30 సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ పోస్టు భర్తీ విషయంలో తొందరపడబోమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవలే చెప్పారు. సీవోఈలో ప్రస్తుతం సుమారు 16 మంది ఫిట్‌నెస్, రిహాబిలిటేషన్ సేవలు అందిస్తున్నారని.. అయితే వారందరినీ పర్యవేక్షించేందుకు సరైన నిపుణుడు అవసరమని తెలిపారు. అలాంటి నిపుణులు భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# కౌంటీ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ మాయ.. ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లతో గంభీర్‌కు గట్టి సందేశం

**ఇంగ్లండ్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కుల్దీప్**

**యార్క్‌షైర్ తరఫున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన వైనం**

**బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచిన స్పిన్నర్**

**భారత, ఇంగ్లండ్ పిచ్‌ల మధ్య ఉన్న తేడాను వివరించిన కుల్దీప్**

టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఒకే మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన**

ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఇంగ్లండ్, భారత పిచ్‌ల మధ్య తేడా ఇదే..**

మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ ఇంగ్లండ్ పిచ్‌ల స్వభావాన్ని వివరించాడు. "ఇక్కడి వికెట్లపై బౌలింగ్ చేయడం చాలా బాగుంది. పిచ్‌లోనే మంచి పేస్ ఉండటంతో మనం వేగంగా బంతులు వేయాల్సిన అవసరం లేదు. బంతి పిచ్ అయ్యాక వేగం పుంజుకుంటుంది. మనం చేయాల్సిందల్లా బంతిని బాగా స్పిన్ చేయడమే. భారత పిచ్‌లతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నం. మన దగ్గర వికెట్లు నెమ్మదిగా ఉంటాయి, స్పిన్ ఎక్కువ తిరుగుతుంది. కానీ బ్యాటర్లు సర్దుకోవడానికి సమయం దొరుకుతుంది. ఇక్కడ పిచ్ వేగం కారణంగా బ్యాటర్లు బ్యాక్‌ఫుట్‌పై ఆడితే దొరికిపోతారు. ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి వస్తుంది. అప్పుడే కీపర్ క్యాచ్, స్లిప్ క్యాచ్ లేదా షార్ట్ లెగ్ క్యాచ్ రూపంలో వికెట్లు తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది" అని కుల్దీప్ విశ్లేషించాడు.

**గంభీర్‌కు సందేశమా?**

లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్లు (చైనామన్) ప్రపంచ క్రికెట్‌లో చాలా అరుదు. అలాంటి అరుదైన నైపుణ్యం ఉన్నప్పటికీ, 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి కుల్దీప్ కేవలం 19 టెస్టుల్లో మాత్రమే ఆడాడు. కెరీర్ ఆరంభంలో అశ్విన్, జడేజా ద్వయం కారణంగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు హెడ్ కోచ్‌గా వచ్చిన గౌతమ్ గంభీర్, కాస్త బ్యాటింగ్ చేయగల బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లకు అవకాశాలు లభిస్తుండగా, కుల్దీప్ జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. నిలకడగా అవకాశాలు లేక తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో 10 వికెట్ల ప్రదర్శనతో తన ప్రధాన బలం బౌలింగే అని, అవకాశాలిస్తే ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు తీయగలనని కుల్దీప్ యాదవ్ సెలక్టర్లకు, యాజమాన్యానికి స్పష్టమైన సంకేతాలు పంపాడు.





# ఢిల్లీ క్రికెటర్లకు డీడీసీఏ ప్రోత్సాహం.. రూ.1.43 కోట్ల ప్రైజ్‌మనీ పంపిణీ



**2025-26 సీజన్‌కు రూ.1.43 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన డీడీసీఏ**

**అన్ని విభాగాల్లో 10 శాతం మేర పెరిగిన బహుమతులు**

**మహిళల టీ20 లీగ్‌కు తొలిసారిగా ప్రైజ్‌మనీ కేటాయింపు**

**యువ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమన్న నిర్వాహకులు**

ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) 2025-26 సీజన్‌కు గాను క్లబ్‌లు, క్రీడాకారులకు భారీ ఎత్తున నగదు బహుమతులను అందజేసింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించిన వార్షిక బహుమతుల ప్రదానోత్సవంలో మొత్తం రూ. 1.43 కోట్ల ప్రైజ్‌మనీని పంపిణీ చేశారు. గత ఏడాదితో పోలిస్తే అన్ని విభాగాల్లో బహుమతుల మొత్తాన్ని 10 శాతం పెంచడం గమనార్హం. ఈ కార్యక్రమానికి డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ, కార్యదర్శి అశోక్ శర్మ, ఉపాధ్యక్షురాలు శిఖా కుమార్, కోశాధికారి హరీష్ సింగ్లా, సంయుక్త కార్యదర్శి అమిత్ గ్రోవర్ హాజరయ్యారు. డీడీసీఏ లీగ్ 40 ఓవర్ల టోర్నమెంట్, పురుషుల టీ20 లీగ్, హాట్ వెదర్ టోర్నమెంట్లలో విజేతలు, రన్నరప్‌లతో పాటు వ్యక్తిగతంగా విశేష ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో డీడీసీఏ ఈసారి కీలక నిర్ణయం తీసుకుంది. మహిళల టీ20 లీగ్‌కు తొలిసారిగా ప్రైజ్‌మనీని ప్రవేశపెట్టింది. ఈ లీగ్‌లోని 10 గ్రూపుల్లో విజేతలకు రూ. 2 లక్షలు, రన్నరప్‌లకు రూ. 1.75 లక్షల చొప్పున బహుమతులను అందజేశారు. మహిళా క్రికెట్‌కు తగిన గుర్తింపునివ్వడంతో పాటు, వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉపాధ్యక్షురాలు శిఖా కుమార్ తెలిపారు. ఢిల్లీ క్రికెట్‌ను అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేయడానికే ఇటువంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ వెల్లడించారు. ఈ నగదు బహుమతులు యువ క్రికెటర్లలో కొత్త ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపి, వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తోడ్పడతాయని కార్యదర్శి అశోక్ శర్మ పేర్కొన్నారు.

# శాంసన్ వర్సెస్ వైభవ్.. ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా ఎవరుండాలంటే? రహానే క్లారిటీ

**వైభవ్ కంటే శాంసన్‌కే ఓపెనర్‌గా అవకాశం ఇవ్వాలన్న రహానే**

**ప్రపంచకప్‌లో టాప్-3నే కొనసాగించాలని సూచన**

**శాంసన్, అభిషేక్, ఇషాన్ టాప్-3లో ఉండాలన్న రహానే**

**వైభవ్‌కు భవిష్యత్తులో అవకాశాలు వస్తాయని అభిప్రాయం**

**ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు శాంసన్ ఎంపికపై రహానే హర్షం**

టీ20ల్లో భారత్ ఓపెనర్ల విషయంలో తరచూ మార్పులు చేస్తోంది. శుభ్‌మన్ గిల్, సంజూ శాంసన్ మధ్య పోటీ నెలకొంది. అభిషేక్ శర్మ ఇప్పటికే తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. తర్వాత ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్‌గా తన వాదన వినిపించాడు. అయితే అతడిని మూడో స్థానానికి పంపించారు. తాజాగా వైభవ్ సూర్యవంశీకి అవకాశం రావడంతో శాంసన్ మరోసారి జట్టులో చోటు కోల్పోయాడు. ఇంగ్లాండ్‌తో అరంగేట్ర సిరీస్‌లో వైభవ్ 14, 13, 15 పరుగులు చేశాడు. తర్వాత జింబాబ్వేతో సిరీస్‌లో మాత్రం అదరగొట్టాడు. మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్ ఉత్తమ ఆటగాడి అవార్డును కూడా అందుకున్నాడు. ఇలాంటి సమయంలో భారత మాజీ బ్యాటర్ అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ కంటే సంజు శాంసన్‌కే మరో అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. వైభవ్‌కు భవిష్యత్తులో చాలా అవకాశాలు వస్తాయని చెప్పాడు. ప్రపంచకప్‌లో రాణించిన టాప్-3 బ్యాటర్లతోనే భారత్ ముందుకెళ్లాలని రహానే సూచించాడు. శాంసన్, అభిషేక్, ఇషాన్ కిషన్ టాప్-3లో ఉండాలని అన్నాడు. రెండు మూడు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన శాంసన్‌ను పక్కన పెట్టడం సరికాదని చెప్పాడు. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవడంపై రహానే సంతోషం వ్యక్తం చేశాడు. ప్రపంచకప్‌లో శాంసన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన విషయాన్ని గుర్తు చేశాడు. శాంసన్ మ్యాచ్ విన్నర్ అని పేర్కొన్నాడు. అతడి రాకతో జట్టు మరింత బలపడుతుందని చెప్పాడు.



హంస కలం వార్త

## 'ది ప్యారడైజ్'కు ట్రైలర్ ఉండదు.. ఎందుకో చెప్పిన హీరో నాని



'ది ప్యారడైజ్' సినిమాకు ట్రైలర్ విడుదల చేయడం లేదని హీరో నాని స్పష్టం చేశారు. సెప్టెంబరు 24న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. సినిమా నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని నాని చెప్పారు. ట్రైలర్ కోసం నాలుగైదు రోజులు కేటాయిస్తే సినిమా పనులపై ప్రభావం పడుతుందని వివరించారు. విడుదలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రస్తుతం తమకు సినిమా పూర్తి చేయడమే ముఖ్యమని పేర్కొన్నారు. శ్రీకాంత్ ఓదెలపై ప్రశంసలు 'దసరా', 'ది ప్యారడైజ్' పాటలు ప్రేక్షకులకు నచ్చడానికి సంగీత దర్శకులతో పాటు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పాత్ర కీలకమని నాని అన్నారు. తనకు కావాల్సిన పాట ఎలా ఉండాలి? ఎవరితో పాడించాలి? ఎలాంటి సాహిత్యం కావాలో? శ్రీకాంత్‌కు స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు. సినిమా కోసం తాను జడలు, చేతిపై టాటూతో కనిపించడంపైనా ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని నాని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సోషల్ మీడియా ధోరణులకు భయపడకుండా తన ఆలోచనను తెరపై చూపించే వ్యక్తి శ్రీకాంత్ అని కొనియాడారు. అతడి పట్టుదల, సినిమా పట్ల ఉన్న ప్రేమ తనకు ఎంతో గర్వంగా అనిపిస్తాయని పేర్కొన్నారు. అత్యంత కష్టమైన సినిమా 'ది ప్యారడైజ్' కోసం తన సినీ ప్రయాణంలోనే ఎక్కువగా కష్టపడ్డానని నాని తెలిపారు. టీజర్‌లోని కొన్ని డైలాగ్స్ అర్థం కావడం లేదని వచ్చిన విమర్శలపై కూడా ఆయన స్పందించారు. కథలోని పాత్ర స్వభావం దెబ్బతినకుండా కొన్ని విషయాలను పూర్తిగా వెల్లడించలేమని చెప్పారు. ఇది పాన్ ఇండియా సినిమా కాదని, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపారు. తల్లీ కొడుకుల బంధం చుట్టూ కథ సాగుతుందని, హింసతో పాటు బలమైన భావోద్వేగాలు కూడా ఉంటాయని చెప్పారు. రన్‌టైమ్.. ప్రీమియర్లపై క్లారిటీ 'ది ప్యారడైజ్' రన్‌టైమ్ 2 గంటల 49 నిమిషాలు ఉంటుందని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల వెల్లడించారు. 'ఏష నాగుల' పాట కోసం ఎవరిని తీసుకోవాలా అని ఆలోచిస్తున్న సమయంలో కీర్తి సురేశ్‌ను సంప్రదించగా ఆమె అంగీకరించారని తెలిపారు. సినిమా షూటింగ్‌లో తనతో పాటు పలువురికి గాయాలయ్యాయని నాని చెప్పారు. అయితే అవి సాధారణమేనని పేర్కొన్నారు. మోహన్‌బాబుతో కలిసి పనిచేయడం మంచి అనుభవమని, ఆయనను దగ్గరగా చూస్తే అభిప్రాయం పూర్తిగా మారుతుందని నాని అన్నారు. సినిమా ప్రీమియర్లు ఉంటాయని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు. టికెట్ ధరల పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

## రూ.100 కోట్ల ఓపెనింగ్.. రూ.300 కోట్ల నష్టం! యశ్ 'టాక్సిక్'కు ఏమైంది?

యశ్ సినిమా అంటేనే భారీ అంచనాలు. 'కేజీఎఫ్-2' తర్వాత ఆయన నటించిన 'టాక్సిక్'పై కూడా అదే స్థాయిలో హైప్ వచ్చింది. కానీ సినిమా బాక్సాఫీస్ దగ్గర మాత్రం ఆ అంచనాలను అందుకోలేకపోయింది. భారీ ఓపెనింగ్ వచ్చినా.. ఆ తర్వాత కలెక్షన్లు ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో ఈ చిత్రం భారీ నష్టాల్లోకి వెళ్లినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'టాక్సిక్' తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.140 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు సమాచారం. భారత్‌లో నెట్ వసూళ్లు సుమారు రూ.101 కోట్లుగా నమోదయ్యాయి. దీంతో సినిమా బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తుందని భావించారు. అయితే రెండో రోజు నుంచే పరిస్థితి మారిపోయింది. భారత్‌లో రెండో రోజు వసూళ్లు దాదాపు రూ.37 కోట్లకు పడిపోయాయి. తొలి సోమవారానికి రూ.10 కోట్ల కంటే దిగువకు చేరాయి. 15 రోజులకు ప్రపంచవ్యాప్తంగా రూ.339 కోట్లకు పైగా వసూలైనట్లు లెక్కలు చెబుతున్నాయి. 16వ రోజు భారత్‌లో కేవలం రూ.40 లక్షల మేరే వసూళ్లు వచ్చినట్లు సమాచారం. ఈ సినిమాకు నిర్మాణ వ్యయం దాదాపు రూ.450 కోట్లు ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ప్రచారం, విడుదల ఖర్చులు, వడ్డీలు కలిపితే మొత్తం పెట్టుబడి రూ.500 కోట్లకు చేరినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో థియేట్రికల్ వసూళ్లు సరిపోక భారీ నష్టం తప్పలేదని ట్రేడ్ విశ్లేషకుడు రమేశ్ బాలా అభిప్రాయపడ్డారు. 'టాక్సిక్' నష్టం రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల వరకు ఉండొచ్చని ఆయన తెలిపారు. 'గేమ్ ఛేంజర్', 'ఆదిపురుష్' వంటి భారీ చిత్రాల సరసన ఇప్పుడు 'టాక్సిక్' కూడా చేరినట్లయింది. ఓటీటీ హక్కులను ముందుగానే విక్రయించకపోవడం కూడా సినిమాకు ప్రతికూలంగా మారిందని బాలా చెప్పారు. భారీ వసూళ్లు వస్తాయని ఎదురుచూసిన నిర్మాతలకు.. సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో ఓటీటీ విలువ కూడా గణనీయంగా పడిపోయినట్లు తెలుస్తోంది.





## గ్లోబల్ స్టార్స్ కోసం వేట.. సౌత్ కొరియా సంస్థతో జతకట్టిన రష్మిక.. యువతకు కీలక సందేశం!

ప్రముఖ కొరియన్ సంస్థ హైబ్ ఇండియా ఆడిషన్స్‌తో జతకట్టిన రష్మిక

భారతీయ యువతలో ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమ లక్ష్యం

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలంటూ యువతకు స్ఫూర్తినిచ్చిన నటి

ప్రస్తుతం 'రణబాలి' చిత్రంతో బిజీగా ఉన్న రష్మిక మందన

స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతకు స్ఫూర్తినిచ్చే ఓ కొత్త కార్యక్రమంతో ముందుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా ఎన్నో పాప్ గ్రూప్‌లను ప్రపంచానికి పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ 'హైబ్' (న్‌దీజు). ఈ సంస్థ భారతదేశంలో 'హైబ్ ఇండియా' పేరుతో ప్రతిభావంతుల అన్వేషణకు ఆడిషన్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రష్మిక మందన భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రతి ప్రయాణం ఒక అవకాశంతో, ఆ మొదటి అడుగు వేయడానికి కావలసిన ధైర్యంతో మొదలవుతుంది. నా జర్నీని వెనక్కి తిరిగి చూసుకుంటే, మనపై మనం నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలకు సరేననడం ఎంత ముఖ్యమో నాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు. భారత్‌లో ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారని రష్మిక అభిప్రాయపడ్డారు. "ప్రపంచవ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన హైబ్ సంస్థ, ఇప్పుడు భారతీయ యువతలోని ప్రతిభను గుర్తించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఎంతోమంది అమ్మాయిలు కళాకారులుగా, పెర్ఫార్మర్లుగా ఎదగాలని కలలు కంటారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ తమ కలకు ఒక అవకాశం ఇవ్వాలి" అంటూ యువతలో ఆమె స్ఫూర్తి నింపారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ (౧ఞు), న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ఎన్నో ప్రఖ్యాత కే-పాప్ గ్రూప్‌లను నిర్వహిస్తోంది. ఇక, సినిమాల విషయానికొస్తే.. రష్మిక ఇటీవల షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు. 1870ల కాలంలో దక్షిణ భారతదేశంలో తీవ్రమైన కరువు నెలకొన్న నేపథ్యంలో తన ప్రజలను, ప్రాంతాన్ని కాపాడుకోవడం కోసం ఓ తిరుగుబాటు యోధుడు బ్రిటిష్ కమిషనర్‌ను ఎలా ఎదుర్కొన్నాడు అనే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, **PRGI TGTEL/26/A3129** Cell.No 9966555449